10వ పాఠం నవంబరు 27-డిశంబరు 3

# జ్ఞాపకము చేసుకొనుము-మరువవద్దు

సబ్బాతు మధ్యాహ్నము : నవంబరు 27

**ఈ వారమునకు చదువ వలసిన వచనములు : ఆదికాం.9:8-17; ఎఫెసి 2:8-13; ద్వితి 4:32-39; ప్రకటన 14:12; ద్వితి 4:9, 23; 6:7; 8:7-18; ఎఫెసి 2:8-13.**

**కంఠతవచనం : "అరణ్యములో నీవు నీ దేవుడైన యెహోవాకు కోపము పుట్టించిన సంగతిని జ్ఞాపకము చేసికొనుము. దాని మరువవద్దు. నీవు ఐగుప్తు దేశములో నుండి బయలుదేరిన దినము మొదలుకొని యీ స్థలమందు మీరు ప్రవేశించువరకు మీరు యెహోవా మీద తిరుగుబాటు చేయుచునే వచ్చిరి" (ద్వితియోపదేశకాండము 9:7).**

జ్ఞాపకము చేసుకొనుము మరియు మరువవద్దు అనే ఈ రెండు మాటలు బైబిలంతటిలో కనిపిస్తాయి. ఈ రెండు మాటలు కూడా మానవ స్వభావమునకు మరియు మన మనస్సులలో సంభవించే విషయమును తెలియజేస్తాయి. ఈ రెండు కూడా క్రియాపదములే. ఒక దానికొకటి వ్యతిరేకమైనవి. జ్ఞాపకము చేసుకొనుటంటే మరువవద్దు అని మరచిపో అంటే జ్ఞాపకము చేసుకొనవద్దు అని అర్థము కాదు.

దేవుడు తన ప్రజలకు చేసిన అన్ని విషయాలను జ్ఞాపకము చేసికొనుము అని వారికి తరచూ చెపుతూ ఉంటాడు. వారి యెడల ఆయన చూపించిన కృపను ఆయన చూపిన మంచితనమును జ్ఞాపకము చేసుకొనవలెను. ప్రవక్తలు ప్రజలకు చెప్పినది అనగా హెబ్రీ ప్రజలకు చెప్పినది అదేవిధముగా వారి యెడల ప్రభువైన దేవుడు చేసిన వాటిని మరువకూడదు. అది పాతనిబంధనంతటిలో ఎక్కువగా గుర్తు చేయడం కనిపిస్తుంది. ప్రాముఖ్యముగా దేవుడు ఆయనయందు వారికివ్వబడిన పిలుపును మరియు ఆ పిలుపునకు తగినట్లుగా వారు ఏరకమైన ప్రజలుగా ఉండాలనే విషయాన్ని వారు మరువరాదని ఆయన ఉద్దేశమైయున్నది "యెహోవా చేసిన కార్యములను పూర్వము జరిగిన నీ ఆశ్చర్యకార్యములను నేను మనస్సునకు తెచ్చుకొందును" (కీర్తన 77:11).

నేడు మనకు ఏమైనా వేరేవిధముగా ఉన్నదా? అందరూ ఒక సంఘ సమూహముగాను, మరీ ముఖ్యముగా ఒక్కొక్క వ్యక్తిగా ఏవిధముగా ఉండాలి? మనకు దేవుడు చేసిన దానిని ఎంత సులభంగా మర్చిపోవచ్చును?

ఈ వారం ద్వితియోపదేశకాండములో పేర్కొనబడినట్లు, మన జీవితములలో దేవుడు

మనతో కలిసి చేసిన పనిని జ్ఞాపకముంచుకోవాలని ప్రధానమైన మూలసూత్రమును అధ్యయనము చేయబోవుచున్నాము.

– డిశంబరు 4, సబ్బాతు దినమున ఈ వారం పాఠమును అధ్యయనము చేయుటకు సిద్ధపడుడి.

**ఆదివారం** **నవంబరు 28**

## మేఘములో దేవుడుంచిన ధనుస్సును జ్ఞాపకముంచుకొనుట

బైబిలులో మొట్టమొదటసారి "జ్ఞాపకముంచుకొనుము" అనే మాట ఆదికాండము 9లో కనిపిస్తుంది. ప్రపంచ వ్యాప్తముగా వచ్చిన జలప్రళయము తరువాత దేవుడు నోవహుతో భూమినంతటను జలప్రళయముతో నాశనము చేయనని ఆయన చేసిన నిబంధనకు గుర్తుగా మేఘములో ధనుస్సును వుంచినప్పుడు చెప్పిన మాట అది.

**ఆది 9:8–17 చదువుడి. "జ్ఞాపకముంచుకొనుడి" అనే మాటను ఇక్కడ ఏవిధముగా వాడిరి? దేవుడు మన యెడల చేసిన దానిని ఏవిధముగా జ్ఞాపకముంచుకోవలెను? అనే విషయమునుండి ఏమి నేర్చుకొనగలము?**

దేవుడు తాను చేసిన వాగ్దానమును మరియు నిబంధనను జ్ఞాపకముంచుకొనుటకు ఆయనకు ధనుస్సు అవసరములేదు. మానవులు అర్థము చేసుకొనుటకు వీలుగా ఆయన ఆవిధముగా మాట్లాడెను. దేవుడు మరొకసారి ఈ భూమినంతటికి జలప్రళయముతో నాశనము చేయబోనని మేఘములో ఉంచిన ధనుస్సు మానవులముగా మనకు ఉపయోగపడుతుందనుకుంటే అది కేవలం దేవుడు చేసిన వాగ్దానమును, నిబంధనను జ్ఞాపకముంచుకొనుటకు సహాయపడుతుంది. ప్రతీసారి ధనుస్సు కనిపించినపుడెల్లా దేవుడు చేసిన నిబంధనను జ్ఞాపకముంచుకొనుటయే గాక, లోకములో ఉన్న పాపముపై దేవుడిచ్చిన తీర్పును, ప్రజల యెడల ఆయనకున్న ప్రేమను గుర్తు చేస్తుంది.

అందువలన ఇక్కడ జ్ఞాపకముంచుకొనుట అనే భావమునకు ప్రాధాన్యతను చూడవచ్చును. దేవుని వాగ్దానములను, ఆయన ఇచ్చే హెచ్చరికలను, ఆయన చేసే క్రియలను జ్ఞాపకముంచుకొనవలసిన అవసరమును చూడగలము. ముఖ్యముగా నవీన కాల శాస్త్రజ్ఞులు ప్రకృతి ధర్మములను ఆధారము చేసుకొని ఒకప్పుడు ప్రపంచ వ్యాప్తముగా జలప్రళయమంటూ ఏమీ రాలేదని కొట్టిపారేస్తున్న ఈ దినములలో మేఘములో ఏర్పడే ధనుస్సును జ్ఞాపకము చేసుకొనుట మరింత ఎక్కువ అవసరముంది. "ప్రకృతి ధర్మములు స్థిరముగా ఏర్పడినవి

కాబట్టి వాటిని దేవుడు కూడా మార్చలేడనియు, అట్టి పరిస్థితిలో ప్రపంచ వ్యాప్తముగా జలప్రళయము వచ్చియున్నదనుటకు ఆధారములు లేవని అనేకమంది వాదించుచున్నారనియు, ఇట్టి పరిస్థితి ఏర్పడుతుందని ఎలెన్ జి వైట్ ముందుగానే వ్రాసియున్నారు”- పితరులు మరియు ప్రవక్తలు, పుట 97. కాబట్టి జలప్రళయమునకు ముందున్న ప్రజలు కూడా ప్రకృతి ధర్మములను అనుసరించి జలప్రళయము వచ్చే అవకాశములేదని వాదించారు. తరువాత ప్రజలు కూడా ప్రకృతి ధర్మముల ప్రకారము జలప్రళయమురాలేదని వాదిస్తున్నారు.

అయితే జలప్రళయము వచ్చిందనియు దానికి గుర్తుగా మేఘములో ధనుస్సు ఏర్పడుతుందనియు, మరొకసారి ప్రపంచ వ్యాప్తమైన జలప్రళయముతో లోకాన్ని నాశనము చేయనని చేసిన వాగ్దానమును కూడా దేవుడు తన వాక్యము ద్వారా మనకు తెలియజేస్తున్నాడు. అందునుబట్టి ధనుస్సును జ్ఞాపకముంచుకున్నచో మేఘముల మీద అందమైన రంగుల ధనుస్సు ద్వారా దేవుని వాక్యమునందు నమ్మకము బలపడుతుంది. దేవుని వాక్యాన్ని నమ్ముచున్నపుడు, వాక్యము ద్వారా ఆయన చెప్పిన అన్ని విషయాలు ఎందుకు నమ్మకూడదు?

**ఇకముందు మేఘాలపై రంగుల ధనుస్సును చూచినపుడు దేవుని యొక్క వాగ్దానములను గూర్చి ఆలోచించుడి. దేవుని వాగ్దానాలన్నిటిని నమ్ముటకు ఎట్లు నేర్చుకొనగలము?**

**సోమవారం** **నవంబరు 29**

## గతించిపోయిన దినములను గురించి

ద్వితి 4లో దేవునిచేత ఎన్నుకొనబడిన ప్రజలుగా ఇశ్రాయేలీయులకివ్వబడిన ఆధిక్యతలను గూర్చి దేవుడు మోషే ద్వారా ఆశ్చర్యకరమైన హితబోధలను చేసినట్లుగ మనము చదివియున్నాము. వారిని ఐగుప్తు నుండి విమోచించియున్నాడు. “మీ దేవుడైన యెహోవా ఐగుప్తులో మీకన్నులయెదుట చేసిన శోధనలతోను, సూచక క్రియలతోను, మహత్కార్యములతోను, యుద్ధముతోను, బాహుబలముతోను, చాచినచేతితోను, మహాభయంకర కార్యములతోను విమోచించెను” (ద్వితి 4:34) అనగా వారికొరకు దేవుడు ఘన కార్యములు చేయుటయే గాక, వాటిని జ్ఞాపకముంచుకొని, ఎన్నడు మరువలేని విధముగా గొప్ప కార్యములను ఆయన చేసెను.

**ద్వితి 4:32-39 చదువుడి. ఏ విషయాన్ని జ్ఞాపకముంచుకొనమని దేవుడు వారికి చెప్పాడు? ఆ విషయాలను జ్ఞాపకముంచుకొనుట ఎందుకంత ప్రాముఖ్యము?**

మోషే ఇశ్రాయేలు ప్రజలను చరిత్ర ఆరంభములోనికి తీసుకొని వెళ్ళి తన వాక్చతుర్యముతో సృష్టి విషయాలను మరియు దేవుడు ఇశ్రాయేలునకు చేసినట్లు మరే దేవుడైనా, ఇతరులకెవరికైనా చేసియున్నాడా అనే విషయాన్ని చక్కగా ప్రశ్నించాడు. మోషే వారిని కొన్ని ప్రశ్నలడుగుట ద్వారా, వారంతట వారే దేవుడు చేసిన కార్యములను గూర్చి వాస్తవములను తెలుసుకొనేటట్లు చేసాడు. అంతిమముగా ఇశ్రాయేలు ప్రజలయెడల దేవుడు చేసిన ఘన కార్యములకై వారు వందనస్తులై ఆయనను కొనియాడాలని మోషే యొక్క ఉద్దేశమైయున్నది.

దేవుడు చేసిన కార్యములలో ఇశ్రాయేలీయులను ఐగుప్తు నుండి విడుదల చేయుటతో పాటు వారితో సీనాయియొద్ద అగ్ని మధ్యనుండి దేవుడు మాట్లాడగా, ఆ మాటలను వారు వినుట గొప్ప ఆశ్చర్యమును గొలిపే విషయమైయున్నది "అగ్ని మధ్యనుండి ఆయన మాటలను వినుటకు వారిని అనుమతించెను".

ద్వితీ 4:40 చదువుడి. దేవుడు ఇశ్రాయేలు ప్రజలయెడల చేసిన దానిని బట్టి వారు ఎట్టి అభిప్రాయమునకు రావాలని మోషే కోరియున్నాడు?

ఎటువంటి లక్ష్యము లేకుండా దేవుడు ఆ కార్యములను చేయలేదు. ఆయన వారితో చేసిన నిబంధన ననుసరించి వారిని విమోచించెను. వారు ఐగుప్తు నుండి విడుదల పొందారు. ఇపుడు వాగ్దాన భూమిలోనికి ప్రవేశించుటకు దగ్గరగా ఉన్నారు. దేవుడు తాను చేయవలసిన బాధ్యతను నెరవేర్చాడు. ఇప్పుడు వారు ఆయనకు విధేయులైయుండాలని వారు నెరవేర్చవలసిన ధర్మమును గుర్తు చేస్తున్నాడు.

**ఇక్కడ వివరించబడిన మాదిరి నూతన నిబంధనలో పేర్కొనబడిన రక్షణ ప్రణాళికకు ఏవిధముగా ఉదాహరణగా ఉన్నది? యేసు మన కొరకు ఏమి చేసెను? ఆయన చేసిన దానికి ఏవిధముగా స్పందించవలసియున్నాము? (ప్రకటన 14:12) చూడుడి.**

మంగళవారం నవంబరు 30

## మరువకయుండునట్లు జాగ్రత్తపడుము

**ద్వితి 4:9-23 చదువుడి. ఇక్కడ దేవుడు వారిని ఏమి చేయమని చెప్పెను. ఇశ్రాయేలు దేశమునకు ఆయన ఇచ్చిన హితబోధ ఎందుకంత ప్రాముఖ్యమైనది?**

"మరువకుండునట్లు" "జాగ్రత్తపడుము" అనే రెండు క్రియాపదములు ఈ రెండు

వాక్యములలో కనిపిస్తున్నవి. మీరు మరువక యుండునట్లు జాగ్రత్తపడుము అని దేవుడు వారికి ఉపదేశించాడు. దేవుడు మీతో చేసిన నిబంధనను ఆయన మీ యెడల చేసిన కార్యములను మరువద్దని మోషే జ్ఞాపకముచేస్తున్నాడు.

"జాగ్రత్తపడుము" "స్మర్" అనే క్రియా పదము (ద్వితి 4:9)లో (నీతో ఉంచుకొనుము' అని తర్జుమా చేయబడినది) పాతనిబంధన అంతటిలోను కనబడుచున్నది. 'దానిని ఉంచుకొనుము' 'కావలికాయుము' 'భద్రపరచు' లేక 'కాపాడు' అనే అర్థాలు కూడా ఉన్నవి. ఆ మాట మొట్టమొదటిసారి లేఖనములలో పాపము ప్రవేశించకముందే కనిపిస్తుంది. దేవుడు ఆదాముతో 'ఏదెనుతోటకు కావలికాయుము" అని చెప్పెను (ఆది 2:15).

ఇప్పుడైతే దేవుడు ప్రజలలోని ఒక్కొక్కరిని (క్రియాపదము ఏకవచనములో ఉన్నది) వారిని వారే కాపాడుకోవాలి లేక వారు మరువకయుండునట్లు జాగ్రత్త పడాలని దేవుడు చెప్పుచున్నాడు. ఇక్కడ మరచిపోకుండా ఉండుట అనగా జ్ఞాపకశక్తిని కోల్పోవుట వలన ఏర్పడే మరుపును గురించి మాట్లాడుట లేదు గాని, నిబంధనను గైకొనే విషయములో ఖండితముగా లేకపోవడమును గూర్చి లేక ఉదాసీనముగా వ్యవహరించుటను గూర్చి హెచ్చరిక చేయబడుచుఉన్నది. వారెవరైయున్నారో అని వారు గుర్తు పెట్టుకొనవలసియున్నది మరియు దేవుని యెదుట, ఇతర హెబ్రీయుల యెదుట, పరదేశుల యెదుట, వారి చుట్టూ ఉన్న ఇతర దేశముల యెదుట ఏవిధముగా వారు జీవించవలసియున్నారో ఆవిషయములో వారు జాగ్రత్త కలిగి యుండాలి.

**మోషే "మీ హృదయములోనుండి వాటిని తీసివేయకుము" అని చెప్పిన తరువాత అదే విషయాన్ని 'ఒక తరము నుండి మరొక తరము వారు' జ్ఞాపకముంచుకొనునట్లు మీ పిల్లలకు వాటిని బోధించమని చెప్పాడు. ఆ విధంగా చెప్పిన విషయాలనే మరొకసారి చెప్పుట వలన దేవుడు చేసిన కార్యాలను మర్చిపోయే అవకాశముండదు. దానికి సంబంధించిన జ్ఞానమును భద్రపర్చుటకు కూడా దోహదపడును. దేవునితో నీకు కలిగిన అనుభవములను ఇతరులతో చెప్పుట వలన కలిగే మేలు ఇతరులకు మాత్రమే గాక అటు నీకు కూడా ఎట్లు ఉపయోగపడుతుంది?**

బుధవారం డిశంబరు 1

## తిని తృప్తి పొందెను

34 సం॥లపాటు జనరల్ కాన్ఫరెన్సు ఆఫ్ సెవెంత్ డే ఎడ్వంటిస్టు ఆఫీసులో

పనిచేసిన పూర్వ సంఘ నాయకుడొకరు ఒక కథను చెప్పారు. కొన్ని సం॥ల క్రితము ఆయన, ఆయన భార్య విమానాశ్రయములో దిగినప్పుడు వారికి చెందిన సామాన్లలో ఒక పెట్టె వారికి అందలేదు. వెంటనే సామాన్లు తీసుకునేచోటే అందరూ చూస్తుండగా ఆ భార్యాభర్తలిద్దరు మోకరించి ప్రార్థించారు. అటు తరువాత మరికొన్ని సం॥లకు అట్టి సంఘటనే జరిగియుంది. వారు చేరవలసిన విమానాశ్రయము చేరిన తరువాత వారి సామానులలో ఒక పెట్టె కనిపించలేదు. వెంటనే ఈసారి తన భార్యతో 'పోయిన వస్తువు సంగతి భీమా సంస్థవారే చూసుకుంటారు' అని చెప్పాడు.

**ఈ కథను మనసులో పెట్టుకొని ద్వితి 8:7-18 చదువుడి ఇక్కడ దేవుడు తన ప్రజలకిస్తున్న హెచ్చరిక ఏమిటి? అది నేడు మనకు ఎటువంటి భావమునిస్తుంది?**

"వారు దేవునికి విశ్వాసులుగా జీవించిన యెడల వారు ఏమి పొందుదురో చూడండి. వారు స్వాధీనపర్చుకొనుటకు సారవంతమైన భూమి లభించును. అది కరువు అనుకొనకుండా నీవు ఆహారమును తిను దేశమది. అందులో నీకు ఏ లోపము ఉండదు" (ద్వితి 8:9). ఆ దేశములో వారు అమితముగా ఆశీర్వదింపబడుదురు. పశువులు, గొర్రెలు, మేకలు వృద్ధియగును. వెండి బంగారమును కలిగియుందురు. అందమైన గృహములు వారికి అనుగ్రహింపబడును. ఈ జీవితమునకు అవసరమైన మరియు సౌకర్యముగా ఉండే భౌతిక సంపదను కలిగియుందురు.

వీటన్నిటి మధ్య ఏమి జరుగును? సంపదతో పాటు దేవుడు చేసిన మేలులను మరచిపోయే ప్రమాదము కూడా పొంచిఉంటుంది. మీరు భాగ్యము సంపాదించుకొనుటకై సామర్థ్యమును కలుగజేయువాడు ఆయనే (ద్వితి 8:18) సంపద వారికి కలిగినప్పుడు అవన్నియు వారి స్వంత శ్రమచేతను, తెలివిచేతను పొందియున్నారని భావించి "ఘోరమైన మహారణ్యములో నుండి వచ్చిన అనుభవమును (ద్వితి 1:19) మరచిపోయారు. ఈ విషయములోనే దేవుడు వారికితరచుగా మోషే ద్వారా హెచ్చరిక చేస్తున్నాడు. అనేక శతాబ్దముల తరువాత యేసు తానే స్వయముగా విత్తు వానిని గూర్చి ఉపమానములో "సంపద వలన కలుగు మోసములను" గూర్చి వివరించియున్నాడు" (మార్కు 4:19).

**మనకు ఇక్కడ ఎంత ధనము, సంపద ఉన్నప్పటికి మనందరము రక్తమాంసములు కలవారమై సమాధి కొరకు ఎదురు చూస్తున్నాము. సంపదతో వచ్చు ప్రమాదమును గూర్చి మనకు ఇదేమి బోధించుచున్నది? ఆ సమాధిలోనుండి మనలను విమోచించువాడు ఎవరు?**

గురువారం డిశంబరు 2

**నీవు ఒక బానిసవని జ్ఞాపకముంచుకొనుము**

**ద్వితి 5:15; 6:12; 15:15; 16:3, 12 మరియు ద్వితి 24:18, 22 చదువుడి. వారు ఎన్నడూ మరచిపోకూడని ఏ విషయమును గూర్చి ప్రత్యేకముగా దేవుడు చెప్పుచున్నాడు మరియు ఎందుకు?**

పాతనిబంధన గ్రంథమంతటిలో ఇశ్రాయేలు ప్రజలు ఐగుప్తు దేశమును విడిచిన మొదలు ఆశ్చర్యకరముగా దేవుడు వారిని ఏవిధముగా నడిపించెనో అనే విషయాన్ని ఎల్లపుడు వారి దృష్టికి తీసుకొనిరావడం మనము చూస్తున్నాము. నేటికి కూడా యూదా మతమును ఆచరించే యూదులు దేవుడు వారి యెడల చేసిన కార్యమునకు జ్ఞాపకార్థముగా పస్కాను ఆచరించుచున్నారు. "యెహోవా తాను సెలవిచ్చినట్లు మీకిచ్చుచున్న దేశమందు మీరు ప్రవేశించిన తరువాత మీరు దీనినాచరింపవలెను. మరియు మీ కుమారులు –మీరు ఆచరించు ఈ ఆచారమేమిటని మిమ్ము నడుగునప్పుడు మీరు – ఇది యెహోవాకు పస్కా బలి. ఆయన ఐగుప్తీయులను హతము చేయుచు మన యిండ్లను కాచినప్పుడు ఆయన ఐగుప్తులో నున్న ఇశ్రాయేలీయుల ఇండ్లను విడిచి పెట్టెను అనవలెనని చెప్పెను. అప్పుడు ప్రజలు తలలు వంచి నమస్కారము చేసిరి" (నిర్గమ 12:25–27).

నేడు క్రైస్తవ సంఘమునకు క్రీస్తునందు మనకు కలిగిన విమోచనమునకు పస్కా ఒక చిహ్నముగా ఉన్నది. "కాగా మన కొరకు క్రీస్తు అను పస్కాపశువు వధింపబడెను" (1కొరింథి 5:7).

**ఎఫెసి 2:8–13 చదువుడి. అన్యజనులైన విశ్వాసులు దేనిని జ్ఞాపకముంచు**

**కొనవలెనని హెచ్చరింపబడిరి. ఈ హెచ్చరిక ద్వితియోపదేశకాండములో ఇశ్రాయేలీయులకు ఇవ్వబడిన హెచ్చరికకు ఏవిధముగా సాదృశ్యము?**

ఈ ప్రజలకు దేవుడు క్రీస్తునందు చేసిన దానిని వారు జ్ఞాపకముంచుకొనవలెనని పౌలు కోరుచున్నాడు. వారిని దేనినుండి ఆయన కాపాడెను? ఇప్పుడు దేవుని యొక్క కృపను బట్టి వారికేమి వున్నది? ఇశ్రాయేలు ప్రజలకు వారంతట వారికి ఏమియు కలుగలేదు. వారిలో ఏమియు లేదు. వారు నిబంధన వాగ్దానములకు అన్యులుగా ఉన్నప్పటికి కేవలం దేవుని యొక్క కృప వలన క్రీస్తు యేసునందు వారున్నారు.

అరణ్యములో యూదులేమి, ఎఫెసీలో క్రైస్తవులేమి, లోకములోని సెవెంతు డే ఎడ్వంటిస్టు సభ్యులేమి, అందరికి దేవుడు చేసిన కార్యము చాలా ప్రాముఖ్యమైనది మరియు దానిని ఎన్నడూ మరువక ఎల్లప్పుడూ జ్ఞాపకముంచుకొనవలెను. అందువలననే మనకు ఈ మాటలు ఇవ్వబడెను.

"క్రీస్తు యొక్క జీవితమును గురించి మనలో ప్రతి ఒక్కరు ప్రతీ రోజు ఒక గంటసేపు ధ్యానించాలి. ప్రతి విషయాన్ని, దృశ్యాన్ని ముఖ్యముగా చివరి ఘట్టములను మన ఊహల్లో బంధించుకోవాలి. ఆయన చేసిన గొప్ప బలియాగమును గురించి ధ్యానించినపుడు ఆయన యందు మన నమ్మకము స్థిరముగా నిలుచును. ఆయన యెడల మన ప్రేమ చురుకుదనముతో వృద్ధి చెందును. అప్పుడు మనము లోతుగా ఆయన ఆత్మతో కలిసిపోవుదుము" –ఎలెన్ జి వైట్, యుగయుగాల అభీష్టము, పుట 83.

**శుక్రవారం** **డిశంబరు 3**

## అదనపు అధ్యయనము

మనుష్యులతో దేవుడు చేసిన నిబంధనకు గురుతుగా మేఘములలో అందమైన ధనుస్సు నియమించుట ద్వారా తప్పిపోయిన తన ప్రజలయెడల ఆయనకున్న దయ, వారి కొరకు తగ్గించుకొనుటయనునది దేవుని యొక్క గొప్పతనమైయున్నది. దేవుడు ఆ ధనుస్సు చూచినపుడు ఆయన చేసిన నిబంధనను జ్ఞాపకము చేసికుంటాడు. అలాగని ఆయన ఎప్పుడైనా మర్చిపోతాడనుకొనకూడదు. మనము బాగుగా అర్థము చేసుకొనుటకు వీలుగా ఆయన ఆవిధముగా మాట్లాడియున్నాడు. కొన్ని తరముల తరువాత ఆకాశములో కనిపించే ధనుస్సు ఏమిటని పిల్లలు అడిగితే తల్లిదండ్రులు వారికి జలప్రళయమును గూర్చి వివరిస్తూ

దేవుడే ధనుస్సును వంచి మేఘములమీద పెట్టెననియు దానిని చూచినపుడెల్లా ఈ లోకమును మరల జలప్రళయముతో నాశనము చేయనని ఆయన ఇచ్చిన వాగ్దానమును జ్ఞాపకము చేస్తుంది. ఆవిధముగా మానవుని యెడల దేవునికున్న ప్రేమను తరతరములకు చాటి చెప్పెను. దేవునిమీద మానవునికున్న నమ్మకముబలపడును" ఎలెన్ జి వైట్, పితరులు మరియు ప్రవక్తలు, పుటలు 106, 107.

క్రైస్తవ మతము నేడు సంపదతోను, సౌకర్యముతోను ఉన్నట్లు అది స్థాపింపబడినప్పుడు లేదు. సంపద ఎప్పుడు కూడా మన ఆధ్యాత్మిక స్థితిపై ప్రభావము చూపిస్తుంది. అయితే ఆ ప్రభావము అన్నివేళలా మంచి కొరకు కాకపోవచ్చును. సంపద క్రైస్తవ విలువలైన ఆత్మ త్యాగము మరియు తనను తాను తగ్గించుకునే విధముగా ప్రోత్సహిస్తుందా? స్వయం సమృద్ధి దేవుని మీద తక్కువగా ఆధారపడే విధానమును ప్రోత్సహిస్తుంది. ధనము మరియు సంపద ఎంత మంచివైనప్పటికి వాటితోపాటు ఆధ్యాత్మిక ఉచ్చులను తీసుకొని వచ్చే ప్రమాదము ఎల్లప్పుడూ ఉంటుంది.

## చర్చించుకొనుటకు ప్రశ్నలు

1. ఒక దేశములో ధనవంతుడు కానివాడు వేరే దేశములో ధనవంతుడుగా పరిగణింపబడతాడు. అది ఏవిధముగా మన ఆధ్యాత్మికతపై ప్రభావము చూపిస్తుంది? ధనము కలిగినవారు వారికి ఎదురయ్యే ఆధ్యాత్మిక ప్రమాదాలను వారి ధనముతో వారిని వారు ఎట్లు కాపాడుకొనగలరు? చర్చించండి.
2. క్రీస్తు యొక్క జీవితములోని చివరి ఘట్టములను గూర్చి మీ తరగతిలో చర్చించండి. ఆ ఘట్టములు మన యెడల ఆయనకున్న ప్రేమను గూర్చి ఎట్లు వివరిస్తాయి?
3. కొంతమంది శాస్త్రజ్ఞులు, బైబిలు చెప్పుచున్నట్లు ప్రపంచ వ్యాప్తమైన జలప్రళయము అనునది ఈ భూమి మీదికి రాలేదని చెప్పుచున్నారు. కొందరు ఆరు దినముల సృష్టి అనునది అసలు జరుగలేదనే వారున్నారు. ఇవన్నియు జరిగినట్లు బైబిలు ధృవీకరిస్తుంది దీనిని బట్టి మన విశ్వాసముపై ఎంత శక్తివంతముగా సంస్కృతి పని చేయుచున్నదో ఎట్లు తెలుసుకొనగలవు?

❋✶❋